www.aksharadarbar.com
శనివారం 04, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :78 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

## నేరస్తులకు శిక్ష పడాల్సిందే

### వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

05

- ఓటమితో గెలుపు బాట
- తెలుగుదేశం పార్టీలో కెరీర్ ఆరంభం
- ప్రజారాజ్యం పార్టీ నుంచి ఫస్ట్ టైం సొంత నియోజకవర్గంలో అసెంబ్లీకి పోటీ
- తొలి ప్రయత్నంలో పరాజయం
- ఓటమిని సవాల్ గా తీసుకొని మరింత పట్టుదలతో ముందుకు
- బీఆర్ఎస్ లో చేరి పొరుగు నియోజకవర్గంలో తనదైన ముద్ర
- వర్ధన్నపేట నుంచి వరుసగా రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నిక
- మెజారిటీ సాధనలో రికార్డుల నమోదు
- పార్లమెంటులో అడుగు పెట్టాలనే లక్ష్యంతో ముందుకు
- అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మొదటిసారి లోక్ సభ ఎన్నికల బరిలో
- మోడీ చరిష్మాకు తోడు తన సానుకూల అంశాలు విజయాన్నిస్తాయని ధీమా
- వరంగల్ పార్లమెంటు స్థానం బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ

పొలిటికల్ లైఫ్ స్టైల్

# కాంట్రాక్టర్ టు పొలిటీషియన్

– మధ్య పేజీలో..

అతను ఓ కాంట్రాక్టర్. ప్రజాసేవకు రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఎలాగైనా చట్టసభలకు ఎన్నిక కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొదట తెలుగుదేశం పార్టీలో పనిచేశారు. ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. పీఆర్పీ నుంచి శాసనసభకు పోటీ చేశారు. తొలి ప్రయత్నం ఫలించలేదు. ఓటమిని సవాల్ గా తీసుకున్నారు. కుంగిపోకుండా లక్ష్య సాధన కోసం బీఆర్ఎస్ లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. స్వరాష్ట్రంలో విజయాన్ని ముద్దాడారు. బీఆర్ఎస్ నుంచి వరుసగా రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. సునాయాస గెలుపుతో మెజారిటీలో రికార్డు నమోదు చేశారు. పదేళ్లలో వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ కోటగా తీర్చిదిద్దడంలో తనదైన భూమిక వహించారు. పార్టీ, ప్రజల్లో పట్టు సాధించి బలమైన నేతగా ఎదిగారు. బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచారు. ఆయనే మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఆరూరి రమేశ్ ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించి లోక్ సభకు వెళ్లటమే టార్గెట్ గా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చరిష్మా, తనకున్న సానుకూల అంశాలు ఈ ఎన్నికల్లో విజయతీరాలకు చేర్చగలవనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో తనదైన శైలి ప్రదర్శిస్తున్న అరూరి రమేశ్ పై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ.

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

9.5 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్ట్

05

## చింతపండు బస్తాల మధ్య గంజాయి రవాణా

## అయ్యో పాపం..

02

- పసిపాపను పాతిపెట్టిన దుర్మార్గులు
- కాపాడిన లారీ డ్రైవర్, ఎంజీఎంకు తరలింపు

## చల్లటి కబురు

- సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు
- ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్

05

## 18న ఛాంబర్ ఎన్నికలు

అదే రోజు ఫలితాలు వెల్లడి

03

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# వరంగల్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల : వరంగల్‌లో వంద శాతం విజయం బీఆర్ఎస్‌దేనని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నడికూడ మండలం వరికోల్, పులిగిల్ల, రాయపర్తి, నర్సక్కపల్లి, నడికూడ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ లో భారీ మెజారిటీతో మారేపల్లి సుధీర్ కుమార్ గెలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటు కాంగ్రెస్‌కు, అటు బీజేపీకి రాష్ట్రంలో ఒకేసారి ఎదురుదెబ్బ తగలబోతోందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి, నాయకులు నందికొండ గణపతిరెడ్డి, నందికొండ జైపాల్ రెడ్డి, భీముడి నాగిరెడ్డి, తిప్పర్తి సాంబశివ రెడ్డి, ఊర రవీందర్ రావు, నల్లెల లింగమూర్తి, గురిజపల్లి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

### ముగ్గురిపై కేసు నమోదు

అక్షర దర్బార్ మల్హర్ : మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే సమాచారం మేరకు భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, కాటారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దుబ్బపేట, అడ్వాలపల్లి గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు గుడుంబా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై టి.నరేందర్ పేర్కొన్నారు. 20 లీటర్ల నాటుసారాయి, 2,600 లీటర్ల నల్లబెల్లం పానకం, చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లుగా తెలిపారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు కోటేశ్వర్, రామకృష్ణ, వెంకట్, రాజు పాల్గొన్నారు.

బెల్లం, చక్కెర పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

## బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

అక్షర దర్బార్, పరకాల : దేశంలో నరేంద్ర మోడీని, వరంగల్ లో అరూరి రమేష్ ను గెలిపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, 48 భూత్ కోఆర్డినేటర్ ఎర్రం రామన్న అన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి రమేష్ గెలుపు కోరుతూ పట్టణంలోని 48వ బూత్ లో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గడపగడపకు వెళ్లి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రచారంలో 48 భూత్ అధ్యక్షుడు పల్లబోయిన భద్రయ్య, వాసుదేవ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎర్రం రామన్న

## రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

### బీఆర్ఎస్ పరకాల పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి

అక్షర దర్బార్, పరకాల : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమని పరకాల పట్టణ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే రైతన్నలకు రుణమాఫీ జరుగుతుందని, లేకుంటే ఆగస్టు 15న మళ్లీ రేవంత్ రెడ్డి పెంచుతాడని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి

అక్షర దర్బార్, చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కడిదెల పద్మ –కుమారస్వామి దంపతుల కూతురు వర్షిని నూతన వస్త్రాలంకరణ వేడుకకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట తక్కల పల్లి రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దొంతి

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్
- దుగ్గొండిలో పోలీస్ కవాత్

అక్షర దర్బార్ దుగ్గొండి : ఎన్నికలవేళ ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకే సబ్ డివిజన్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం దుగ్గొండి మండల కేంద్రంలో సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నర్సంపేట సీఐ రమణమూర్తి, దుగ్గొండి రూరల్ సీఐ రాజగోపాల్, నెక్కొండ సీఐ చంద్రమోహన్, దుగ్గొండి ఎస్సై జక్కుల పరమేశ్వర్, నల్లబెల్లి ఎస్సై రామారావు, చంద్రాపేట ఎస్సై అరుణ్ కుమార్, కొనాపురం ఎస్సై రఘుపతి, ప్రవీణ్, డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో కవాతు చేస్తున్న పోలీసులు

ఎంజీఎంలో చికిత్స పొందుతున్న చిన్నారి

## అయ్యో పాపం..

- పసిపాపను పాతిపెట్టిన కసాయిలు
- కాపాడిన లారీ డ్రైవర్, ఎంజీఎంకు తరలింపు

అక్షర దర్బార్ , పరకాల : అభంశుభం తెలియని అప్పుడే పుట్టిన పసి గుడ్డును భూమిలో పాతిపెట్టి చంపాలని చూశారు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు. అయినా ఓ లారీ డ్రైవర్ పసిగుడ్డును పాతి పెట్టిన స్థలంలో భూమి కదలికలను గమనించి స్థానికులకు సమాచారం అందించి ప్రాణాలు కాపాడాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దామెర మండలం ఊరుగొండ గ్రామ శివారులో శనివారం హైవే పనులకు నీళ్లు సప్లై చేస్తున్న లారీ డ్రైవర్ రామ్ దినయి లారీ పక్కన ఆపి సేద తీరుతున్నాడు. ఆ పక్కనే భూమిలో చిన్న కదలికలు గమనించాడు. అనుమానంతో మట్టి తోడి చూడగా పాతి పెట్టిన శిశువు కదలికలను గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పసి పాపను హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతోంది.

## ఎంపీగా సుధీర్ కుమార్‌ను గెలిపించాలి

అక్షర దర్బార్, పరకాల : వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 15 , 22వ వార్డులోని 40, 43వ బూత్ లలో కౌన్సిలర్ చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. తెలంగాణకు కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్ కుమార్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ కౌన్సిలర్ కందుకూరి వేణుగోపాల మూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరకాల పట్టణంలో ప్రచారం చేస్తున్న నాయకులు

## వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

అక్షర దర్బార్ నర్సంపేట: వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని ఇప్పల తండా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మీరా మంగ్యా నాయక్ (50) వ్యవసాయ పనుల నిమిత్తం గత నాలుగైదు రోజులుగా కూలి పనులకు వెళ్తున్నాడు ఈ క్రమంలో ఎండ దెబ్బకు గురైన మంగ్య నాయక్ ను కుటుంబ సభ్యులు నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

# కాంట్రాక్టర్ టు పొలిటీషియన్

## పొలిటికల్ లైఫ్ స్టైల్

- ఓటమితో గెలుపు బాట
- తెలుగుదేశం పార్టీలో కెరీర్ ఆరంభం
- ప్రజారాజ్యం పార్టీ నుంచి ఫస్ట్ టైం సొంత నియోజకవర్గంలో అసెంబ్లీకి పోటీ
- తొలి ప్రయత్నంలో పరాజయం
- ఓటమిని సవాల్ గా తీసుకొని మరింత పట్టుదలతో ముందుకు
- బీఆర్ఎస్ లో చేరి పొరుగు నియోజకవర్గంలో తనదైన ముద్ర
- వర్ధన్నపేట నుంచి వరుసగా రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నిక
- మెజారిటీ సాధనలో రికార్డుల నమోదు
- రాజకీయ దిగ్గజాల నేలపై మూడోసారి ఓటమితో హ్యాట్రిక్ మిస్
- అయినా వెనుకడుగు వేయనే తెగువ
- పార్లమెంటులో అడుగు పెట్టాలనే లక్ష్యంతో ముందుకు
- అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మొదటిసారి లోక్ సభ ఎన్నికల బరిలో
- మోడీ చరిష్మాకు తోడు తన సానుకూల అంశాలు విజయాన్నిస్తాయని ధీమా
- వరంగల్ పార్లమెంటు స్థానం బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ

అతను ఓ కాంట్రాక్టర్. ప్రజాసేవకు రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఎలాగైనా చట్టసభలకు ఎన్నిక కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొదట తెలుగుదేశం పార్టీలో పనిచేశారు. ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. పీఆర్పీ నుంచి శాసనసభకు పోటీ చేశారు. తొలి ప్రయత్నం ఫలించలేదు. ఓటమిని సవాల్ గా తీసుకున్నారు. కుంగిపోకుండా లక్ష్య సాధన కోసం బీఆర్ఎస్ లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. స్వరాష్ట్రంలో విజయాన్ని ముద్దాడారు. బీఆర్ఎస్ నుంచి వరుసగా రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. సునాయాస గెలుపుతో మెజారిటీలో రికార్డు నమోదు చేశారు. పదేళ్లలో వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ కోటగా తీర్చిదిద్దడంలో తనదైన భూమిక వహించారు. పార్టీ, ప్రజల్లో పట్టు సాధించి బలమైన నేతగా ఎదిగారు. ఈ నియోజకవర్గానికి చెందిన రాజకీయ దిగ్గజాలు పలువురు వివిధ కారణాల వల్ల ఇతర నియోజకవర్గాలను తమ కార్యక్షేత్రంగా చేసుకోగా... స్థానికేతరుడిగా ఆయన వర్ధన్నపేట నుంచి శాసనసభకు వరుసగా రెండుసార్లు ఎన్నిక కావడం విశేషం. బీఆర్ఎస్ నుంచి మూడోసారి అసెంబ్లీకి పోటీ చేసి హ్యాట్రిక్ మిస్ అయ్యారు. ఓటమితో వెనుకడుగు వేయకుండా పార్లమెంటులో అడుగు పెట్టడంపై దృష్టి సారించారు. బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచారు. ఆయనే మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఆరూరి రమేశ్ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించి లోక్ సభకు వెళ్లటమే టార్గెట్ గా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అందరివాడిగా తనను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారని, ఆదరిస్తున్నారని రమేశ్చెపుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చరిష్మా, తనకున్న సానుకూల అంశాలు ఈ ఎన్నికల్లో విజయతీరాలకు చేర్చగలవనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో తనదైన శైలి ప్రదర్శిస్తున్న అరూరి రమేశ్పై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ.

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

### కుటుంబ నేపథ్యం

కాంట్రాక్టర్, పొలిటికల్ గా రాణించిన ఆరూరి రమేశ్విద్యావంతుడు. అరూరి గట్టుమల్లు, వెంకటమ్మ దంపతులకు 1967 ఏప్రిల్ 4న రమేశ్జన్మించారు. ఏంఏ సోషియాలజీ పూర్తిచేసిన అనంతరం న్యాయ విద్యలో ప్రవేశం పొందారు. రమేశ్స్వగ్రామం జనగామ జిల్లా జఫర్ గడ్ మండలం ఉప్పుగల్. ఈ గ్రామం స్టేషన్ గణపురం నియోజకవర్గం పరిధిలోనిది కావటం గమనార్హం. ప్రస్తుతం ఆరూరి కాజీపేట ప్రశాంత్ నగర్ లో నివాసం ఏర్పరుచుకున్నారు. న్యాయ విద్యను పూర్తి చేసి జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న కవిత కుమారితో రమేశ్కు వివాహం జరిగింది. వీరికి కుమారుడు విశాల్, కుమార్తె అక్షిత ఉన్నారు.

### ఫస్ట్ టైం ఓటమి

వృత్తిరీత్యా అరూరి రమేష్ కాంట్రాక్టర్. గుత్తేదార్ నుంచి పొలిటికల్ కెరీర్ ను ప్రారంభించారు. రాజకీయాల్లోకి వచ్చిన మొదట్లో పరాజయం ఎదుర్కొన్నారు. అయినా కుంగిపోకుండా రాజకీయాల్లో నిలబడి గెలిచారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకెళ్లడం ద్వారా విజయాలను ముద్దాడారు. ప్రజాధరణ గల నేతగా అనతి కాలంలోనే గుర్తింపు తెచ్చుకున్నారు. టీడీపీలో రాజకీయ అరంగ్రేటం చేసిన అరూరి ఆ పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. 1987లో తెలుగు యువత జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 1994లో టీడీపీ సమన్వయ కమిటీ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలం తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ గా నియమితులయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా తన సొంత నియోజకవర్గమైన స్టేషన్ ఘనపురం నుంచి శాసనసభకు తొలిసారి పోటీ చేసి ఓటమిని చవిచూశారు. 2014లో తెలంగాణ కవులు, కళాకారుల కళాసంఘం గౌరవ అధ్యక్షునిగా, కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా వ్యవహరించారు.

### ఆధిక్యంలో రికార్డు..

ప్రజారాజ్యం తర్వాత రమేశ్బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆయనకు పార్టీ అధినేత కేసీఆర్ 2014 ఎన్నికల్లో పొరుగుదైన వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ కేటాయించారు. ఈ ఎన్నికల్లో 87వేలకు పైగా ఓట్లతో గెలిచిన అరూరి మొదటిసారి ఆసెంబ్లీలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యే కావాలన్న తన పట్టుదల నెరవేర్చుకున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి 2018 ఎన్నికల్లోనూ ఆయన బీఆర్ఎస్ అభ్యర్థిగా వరుసగా రెండోసారి బరిలో దిగి భారీ మెజార్టీతో గెలుపొందారు. 99,240పైగా ఓట్లతో భారీ విజయాన్ని అందుకున్నారు. ఆ ఎన్నికల్లో ఈ మెజార్టీ ఫిగర్ రాష్ట్రంలోనే రెండోది. సిద్ధిపేట తర్వాత వర్ధన్నపేటదే అత్యధిక మెజారిటీ. ఇక్కడ ఈ మెజారిటీ రికార్డ్. పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ వరంగల్ జిల్లా పగ్గాలు కూడా రమేశ్కు అప్పగించారు. 2023 ఎన్నికల్లో ఇదే వర్ధన్నపేట నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేసిన రమేశ్మూడో సారి ఓడిపోవడంతో హ్యాట్రిక్ మిస్ అయింది. అనంతరం జరిగిన అనూహ్య పరిణామాలతో అరూరి బీజేపీలో చేరారు. చేరి చేరగానే వరంగల్ లోకసభ స్థానం నుంచి కాషాయ దళం ఆరూరిని పార్లమెంట్ ఎన్నికల బరిలో దింపింది. ప్రస్తుత్తం వరంగల్ లోక్ సభ స్థానం నుంచి గెలవటమే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

### ఉద్యమంలో కీలకంగా..

ప్రజారాజ్యం పార్టీలో చేరి అదృష్టాన్ని పరీక్షించుకుని విఫలమైన తర్వాత రమేశ్ పట్టువీడని విక్రమార్కునిలా ప్రయత్నాలు సాగించారు. అంకితభావం, చిత్తశుద్ధి, పట్టుదలతో రాజకీయాల్లో ముందుకెళ్లారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. తెలంగాణ కోసం గట్టిగా పోరాడిన వ్యక్తుల్లో రమేశ్ఒకరు. బీఆర్ఎస్ లో చేరాక ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక జరిగిన మొదటి ఎన్నికల్లో గులాబీ పార్టీ నుంచి గెలుపొందారు. ఏ పార్టీలో ఉన్నా ఉద్యమంలో కీలకంగానే వ్యవహరించారు. ఏదో తూతూ మంత్రంగా పనిచేయకుండా పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించి చిత్తశుద్ధిని ప్రదర్శించారు. వివాదరహితుడిగా అందరితో కలివిడిగా ఉండే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తక్కువ కాలంలోనే మంచి పేరు సంపాదించుకున్నారు. ఎక్కడ పనిచేసినా తనదైన మార్క్ చూపించారు. తమ పార్టీ పెద్దలతో, ప్రముఖ నేతలతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. కష్టపడి తన బలాన్ని పెంచుకున్నారు. దీంతో బీఆర్ఎస్ అధిష్టానం పార్టీలో ఆయనకు ప్రాధాన్యం ఇచ్చింది.

### నిరంతరం ప్రజల మధ్య..

రాజకీయాల్లో అడుగు పెట్టినప్పటి నుంచి ఆరూరి నిరంతరం ప్రజల మధ్య ఉండడానికే సమయం కేటాయిస్తున్నారు. ఎప్పుడూ ప్రజల్లో ఉండాలనేదే ఆయన తత్వం. ప్రజల కష్టసుఖాల్లో తాను భాగస్వామిని కావడానికే ప్రాధాన్యం ఇస్తారు. సమస్యలతో తనను సంప్రదించే ప్రజలకు పరిష్కారం కోసం తనవంతు సహకారం చేస్తారు. అధికారులతో మాట్లాడి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముందుంటారు. ఏ ప్రాంత సమస్య అయినా తన దృష్టికి వస్తే వెనువెంటనే పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తారు. అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తారు. రెండుసార్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన ఆరూరి నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ప్రత్యేకత చాటారు. ఇమేజ్ గల నాయకుడిగా బీజేపీలో చేరారు. సొంత ఇమేజ్, పార్టీ బలం, ప్రధాని మోడీ చరిష్మా ఈ ఎన్నికల్లో తనకు కలిసి వస్తోందనే విశ్వాసంతో ఉన్నారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఏర్పాటుచేసిన ఆయన ఫౌండేషన్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

### లోక్ సభకు మొదటిసారి

రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రమేశ్మొదటిసారి పార్లమెంట్ఎన్నికల బరిలో నిలిచారు. వరంగల్ లోకసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గత ఎంపీలు చేయని పనులు, విఫలమైన తీరును ఎండగడుతూనే ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఎంపీగా ఏం చేస్తానో ప్రజలకు స్పష్టంగా వివరిస్తున్నారు. రాష్ట్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదని పలు వేదికలపై విమర్శించారు. తనను గెలిపిస్తే గ్రేటర్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతో పాటు మామునూరు ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీలు ఇస్తున్నారు. టెక్స్ టైల్ పార్క్ లను నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెపుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఓరగల్లు రూపు రేఖలు మారుస్తానని అంటున్నారు. ప్రచారంలో తనకు ప్రజల నుంచి లభిస్తోన్న ఆదరణతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# చింతపండు బస్తాల మధ్య గంజాయి రవాణా

- 9.5 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురు అరెస్ట్

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న హనుమకొండ డీసీపీ దేవేందర్ రెడ్డి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: సులువుగా డబ్బులు సంపాదించాలని అక్రమార్కులు కొత్త కొత్త దారులు వెతుకుతున్నారు. తాజాగా చింతపండు, యూరియా బస్తాల మధ్యలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.2.35 లక్షల విలువ చేసే 9.5 కిలోల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలను హనుమకొండ డీసీపీ దేవేందర్ రెడ్డి వివరాలను శనివారం వెల్లడించారు.
అరెస్ట్ చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన ఈదర కృష్ణ నాగేశ్వరావు, ఆనుమోలు వెంకట రమణ, హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ రహీమ్, మధ్యప్రదేశ్ రాష్ట్రం రీవా జిల్లా మన్గవ్ మండలం ధారావిపు గ్రామానికి చెందిన శ్రీకర్ త్రిపాఠి ని పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సీలేరు కు చెందిన సురేష్ పరారీలో ఉన్నాడు. ఈదర కృష్ణ నాగేశ్వరావు, ఆనుమోలు వెంకట రమణ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఆంధ్ర ప్రదేశ్ సీలేరు కు చెందిన ప్రస్తుతం పరారీలో ఉన్న సురేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి దానిని ఎవరికీ అనుమానం రాకుండా చింత పండు, యూరియ బస్తాల నడుమ రహస్యంగా భద్రపరిచిన గంజాయిని పరిచయం ఉన్న మహ్మద్ అబ్దుల్ రహీమ్,శ్రీకర్ త్రిపాఠి లకు అందజేసేందుకు శుక్రవారం హనుమకొండ కు బస్సులో వచ్చారు. గంజాయిని అందజేసే క్రమంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. గంజాయిని విక్రయించడానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన వీరిని తనిఖీ చేయగా అసలు విషయం వెలుగు లోకి వచ్చింది. హనుమకొండ ఎస్.ఐ శ్రవణ్ కుమార్ తన సిబ్బందితో వెళ్ళి నలుగురు నిందితులను అదుపులోకి విచారించగా నిందితులు గంజాయి క్రయ విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చి వారి వద్ద వున్న గంజాయి, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను పోలీస్ స్టేషన్ కు తరలించారు.గంజాయి స్మగ్లర్ ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఇన్ స్పెక్టర్ సతీష్, ఎస్. ఐ శ్రావణ్ కుమార్ , హనుమకొండ పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## బలరాం నాయక్‌కు మాతృ వియోగం



లక్ష్మీబాయి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ మాతృమూర్తి లక్ష్మీబాయి (100) శనివారం మరణించారు. వరంగల్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. బలరాం నాయక్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: మట్టెవాడ, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు దిగొద్దని, దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, భూదందాల్లో తల దూర్చడం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు గోపి, శివకుమార్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

# నేరస్తులకు శిక్ష పడాల్సిందే

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : నేరస్తులకు కోర్టులో శిక్షపడే విధంగా పోలీస్ అధికారులు విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వివిధ నేరాల్లో నేరస్తులకు కోర్టుల్లో యావజ్జీవ కారాగార శిక్ష విధించడంలో విశేష కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. శిక్షల శాతం ఘననీయంగా పెంచాల్సిన బాధ్యత పోలీస్ సిబ్బందిపై ఉందని, నేరం చేస్తే తప్పక శిక్ష పడుతుందనే భయం నేరస్తులకు కలిగించాలన్నారు. ముఖ్యంగా నేరస్తులకు కోర్టులో శిక్ష పడటం ద్వారా బాధితులకు కొంత వరకైనా స్వాంతన చేకూరడంతో పాటు పోలీసులపై నమ్మకం, గౌరవం పెరుగుతుందని తెలిపారు. అలాగే మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడిన నేరస్తులకు తప్పక శిక్షపడేందుకు కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు, దర్యాప్తు పోలీస్ అధికారులు తీవ్రంగా కృషి చేయాలని, గ్రేవ్ కేసుల్లో నేరస్తులకు వంద శాతం శిక్ష పడేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని, రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబరిచి నేరస్తులకు శిక్షలు పడటంలో తెలంగాణాలోనే వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రథమ స్థానం ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. సమావేశంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ యం.సత్యనారయణ, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్ స్పెక్టర్లు శ్రీధర్‌రావు, గణేష్, రవికుమార్, అశోక్, అడిషినల్ పీపీలు రంజిత్, రాజమల్లరెడ్డి, స్టివెన్ తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు

- ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు

అక్షర దర్బార్, హైదరాబాద్: కొద్ది రోజుల నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు చెప్పింది. సోమవారం నుంచి రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. అయితే నేడు, రేపు ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని, అలాగే ఉక్కపోత వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ జగిత్యాల జిల్లా అల్లీపూర్, కరీంనగర్ జిల్లా వీణవంకలో అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 26 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా టెంపరేచర్ నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైన హైదరాబాదులో శనివారం, ఆదివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని, సోమవారం నుంచి ఎల్లో అలర్ట్ వస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. మే 7, 8 తేదీల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ విధించామని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల దాకా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని హెచ్చరించారు. ఒకవైపు పెరిగిన ఈ ఎండలతో బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎండ వేడి నుంచి రక్షణ పొందేందుకు చల్లని వస్తువులు సేవిస్తే మంచిది. కొబ్బరి బొండాం, మంచినీళ్లు, మజ్జిగ, లస్సీ వంటి పానీయాలు సేవిస్తే ఎండ దెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.

## 18న ఛాంబర్ ఎన్నికలు

- అదే రోజు ఫలితాలు వెల్లడి

అక్షర దర్బార్, వరంగల్: ఈనెల 18న వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంస్థకు మూడేళ్లకు గాను ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఈ మేరకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎన్నికల అధికారి తాబేటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నవంబర్ 3న వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంస్థకు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కోర్టు ఆదేశాలతో నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియను తిరిగి కొనసాగించడానికి వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంస్థ నిర్ణయించింది. కార్యనిర్వాహక సభ్యుల పదవులైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గౌరవ ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, ఐదుగురు కార్యవర్గ సభ్యుల స్థానాలకు ఈనెల 18న ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇదివరకే ప్రకటించిన పోటీదారులు ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ పత్రాలు ఉపసంహరణ, సాయంత్రం 6 గంటలకు పోటీ అభ్యర్థుల తుది జాబితాను వెల్లడించనున్నట్లు తెలిపారు.